రైతుబజార్లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో... రూపాయల్లో)... టమాటా 13, వంకాయ 18, బెండ 40, పచ్చిమిర్చి 55, కాకర 35, బీర 35, క్యాబేజీ 19, ఫ్రెంచి బీన్స్ 55, క్యారెట్ 19, దొండ 18–28, చిక్కుడు 28–48, గోకర 35, బీట్‌రూట్ 19. క్యాప్సికం 70, ఆలు 25, దోస 18, సొర 9, పొట్ల 18, ఉల్లిగడ్డ 19, చామగడ్డ 40. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

ఆదరణ హోంలో హోలీ వేడుకలు


రెస్టారెంట్ భోజనం చేస్తున్న విద్యార్థులు

చైతన్యపురి: ఆదరణ హోమ్‌లో 'ప్లాట్ ఫామ్–65' రెస్టారెంట్ ఆధ్వర్యంలో హోలీ వేడుకలు నిర్వహించారు. హోమ్‌లోని చిన్నారులతో నిర్వాహకులు ఉత్సాహంగా హోలీ ఆడారు. హోమ్‌లోని చిన్నారులందరికీ రెస్టారెంట్ భోజనం ఏర్పాటు చేసి సంహపంక్తి భోజనం చేశారు. హోలీ వేడుకలను ఆదరణ ఆశ్రమ చిన్నారులతో జరుపుకోవటం సంతోషాన్ని కలిగించిందని ప్లాట్ ఫాం–65 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వాల శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో ఎండీ సద్గుణ్ పాదా, ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.


ఎల్‌బీనగర్ రింగ్‌రోడ్డులో బస్సుల కోసం ఎదురు చూస్తున్న ప్రయాణికులు


రింగ్‌రోడ్డులోని సైక్లింగ్, వాకింగ్ ట్రాక్‌లపై చిరువ్యాపారుల బండ్లు

రింగ్ రోడ్డులో దళారుల దోపిడీ

- సైక్లింగ్, వాకింగ్ ట్రాక్‌లపై తోపుడు బండ్ల తిష్ట
- రోడ్డుపైనే ప్రైవేట్ వాహనాల పార్కింగ్
- వీరి నుంచి దళారుల ముఠా కమీషన్ వసూలు
- నిలబడేందుకు స్థలం లేక రోడ్లపైనే ప్రయాణికుల అగచాట్లు
- పట్టించుకోని పోలీసు, ఆర్టీఏ అధికారులు

మన్సూరాబాద్: హైదరాబాద్ నగరానికి ముఖద్వారమైన ఎల్‌బీనగర్ రింగ్‌రోడ్డులో తెలుగు రాష్ట్రాల ప్రయాణికులు అనేక అవస్థలు పడుతున్నారు. బస్‌షెల్టర్లు లేకపోవడంతో నిలువ నీడ కొరువై రోడ్డుపై ఎండలోనే బస్సుల కోసం ఎదురు చూస్తున్నారు. పొరుగు రాష్ట్రం, తెలంగాణలోని దూర ప్రాంత ప్రయాణికులు నగరానికి వచ్చే ముఖద్వారం ఆకర్షణీయంగా ఉండాలని ప్రయోగాత్మకంగా గ్రీనరీని ఏర్పాటు చేశారు. ఇక్కడ సైక్లింగ్, వాకింగ్ ట్రాక్‌లను ఏర్పాటు చేసి అందంగా తీర్చిదిద్దారు. అధికారులు ఎంతో డబ్బు ఖర్చు చేసి ఏర్పాటు చేసిన ఈ ప్రాంతం తోపుడు బండ్లు, చిరువ్యాపారులకు, దళారులకు అడ్డగా మారింది. సైక్లింగ్, వాకింగ్ ట్రాక్‌లు చిరువ్యాపారుల బండ్లతో నిండిపోతున్నాయి. కొందరు దళారులు ముఠాగా ఏర్పడి ప్రైవేట్ వాహనదారుల నుంచి డబ్బులు వసూలు చేస్తూ ప్రధాన రోడ్డుపై వాహనాలను పార్కింగ్ చేయిస్తున్నారు. దీంతో ఈ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. దీని ప్రభావం వల్ల కొన్ని సమయాల్లో ఎల్‌బీనగర్ ఫ్లై ఓవర్‌పై కూడా ట్రాఫిక్ జామ్ అవుతోంది.


రింగ్‌రోడ్డులో రోడ్డుపైనే నిలిపి ఉన్న ప్రైవేట్ వాహనాలు

వారు చెప్పిన చార్జీలు చెల్లించాల్సిందే...

ప్రయాణికులు ఎల్‌బీనగర్ రింగ్‌రోడ్డులో ప్రైవేట్ వాహనం లేదా ట్రావెల్స్ బస్సు ఎక్కాలంటే దళారులు చెప్పిన చార్జీలు చెల్లించాల్సిందే. ఈ ప్రాంతంలో ప్రైవేట్ వాహనాన్ని నిలుపాలంటే ఇక్కడ ఉండే దళారులకు కమీషన్ ఇవ్వాల్సిందే. ప్రతి ప్రైవేట్ వాహనానికి దళారులు వెయ్యి రూపాయల నుంచి రూ.2 వేలు వరకు వసూలు చేస్తున్నారు. కమీషన్ చెల్లించని వాహనాల యజమానులను దళారుల ముఠా బెదిరించి ఇక్కడ వాహనాలను నిలుపనీయడం లేదు. కమీషన్ ఇవ్వని వారిపై కొన్ని సందర్భాల్లో దాడులకు కూడా దిగుతున్నారు. ప్రయాణికులు జోక్యం చేసుకుంటే వారిని కూడా బెదిరించి భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. ట్రాఫిక్ పోలీసులు, రవాణాశాఖ అధికారులకు ఈ విషయం తెలిసి కూడా పట్టించుకోవడం లేదని ప్రయాణికులు, ప్రైవేట్ వాహనదారులు వాపోతున్నారు. సైకింగ్, వాకింగ్ ట్రాక్‌పై ఏర్పాటు చేసిన తోపుడు బండ్లు, చిరువ్యాపారుల నుంచి, ప్రైవేటు వాహనాల దళారుల నుంచి నెలవారీ మామూళ్లు వసూళ్లు చేస్తూ పోలీసులు, ఆర్టీఏ అధికారులు వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

తక్షణమే గొర్రెల పంపిణీ చేపట్టాలి

వనస్థలిపురం: గొల్ల, కురుమలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మోసం చేశాడని ప్రజా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ దాసరి అజయ్‌కుమార్ యాదవ్ ఒక ప్రకటనలో ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే గొర్రెల పంపిణీ చేస్తానన్న మాటను ఆయన తుంగలో తొక్కారని అన్నారు. గొల్ల, కురుమలు గొర్రెల కోసం అప్పులు చేసి డీడీలు కట్టారని, ఏళ్ల గడుస్తున్నా వారికి గొర్రెలను పంపిణీ చేయకపోవడం దురదృష్టకరమని అన్నారు. తక్షణమే గొర్రెల పంపిణీ చేపట్టాలని, లేనిపక్షంలో డీడీలు కట్టిన లబ్ధిదారులకు వడ్డీతో సహా చెల్లించేలా కలెక్టర్లకు ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో పార్లమెంట్ ఎన్నికల్లో గొల్ల కురుమలు కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్తారని ఆయన హెచ్చరించారు.

ఆధ్యాత్మికతతో ఆత్మవిశ్వాసం


ఎమ్మెల్యే సబితారెడ్డికి జ్ఞాపికను అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

దిల్‌సుఖ్‌నగర్: ఆధ్యాత్మికతతో ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని, ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మంగళవారం ఆర్‌కేపురం శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్సీ బొగ్గరపు దయానంద్ గుప్తా, బీఆర్‌ఎస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి అరవింద శర్మ, రమేష్ గుప్తా, మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ పటేల్ సునీతా రెడ్డి, డివిజన్ మహిళా అధ్యక్షురాలు ఊర్మిళా రెడ్డి, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, కొంద్ర శ్రీనివాస్, శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

భాగ్యనగర్ జిల్లా బీజేవైఎం అధ్యక్షుడిగా భరత్‌కుమార్


సురేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న భరత్, విజయ్‌కాంత్ తదితరులు

మలక్‌పేట: భాగ్యనగర్ జిల్లా బీజేవైఎం అధ్యక్షుడిగా మూసారంబాగ్ డివిజన్‌కు చెందిన అనుముల భరత్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా భరత్‌కుమార్ యువమోర్చా నాయకులతో కలిసి మంగళవారం సురేందర్‌రెడ్డి నివాసానికి వెళ్లారు. అధ్యక్షుడిగా తనకు అవకాశం కల్పించిన సురేందర్‌రెడ్డిని ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. యువ మోర్చాను మరింతగా పటిష్టం చేయడానికి, పార్టీ కార్యక్రమాలు విజయవంతం చేయడానికి కృషి చేస్తానని భరత్ అన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నేత గౌర విజయ్‌కాంత్, బీజేవైఎం నాయకులు బండారి నవీన్, ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

దశల వారీగా సమస్యలన్నీ పరిష్కరిస్తా: ఎమ్మెల్యే


ఉదయ్‌నగర్‌లో పాదయాత్ర చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తదితరులు

చంపాపేట: ఎల్‌బీనగర్ నియోజకవర్గ పరిధిలోని పలు డివిజన్లలో నెలకొన్న మౌలిక సమస్యలన్నింటినీ ప్రాధాన్యతా క్రమంలో దశలవారీగా పరిష్కరించి ఎల్బీనగర్‌ను ఇతర నియోజకవర్గాలకు ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యేఈ దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. మంగళవారం చంపాపేట డివిజన్ పరిధిలోని ఉదయ్‌నగర్, ఎంఆర్‌ఆర్, పద్మానగర్, సూర్యానగర్ కాలనీవాసుల ఫిర్యాదు మేరకు ఆయా కాలనీల్లో పాదయాత్ర చేశారు. పార్కులో పడకేసిన పచ్చదనం, బాక్స్ టైప్ వరదనీటి కాలువ, గుంతలుగా మారిన అంతర్గత రహదారులు వంటి సమస్యలను పరిశీలించారు. వెంటనే ఆయన సర్కిల్ అధికారులకు ఫోన్ చేసి కాలనీల్లోని సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం ఉదయ్‌నగర్ కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ.. అసంపూర్తిగా ఉన్న అభివృద్ధి పనులన్నింటినీ త్వరలో పూర్తి చేయిస్తామని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సుంకోజు కృష్ణమాచారి, ఓరుగంటి వెంకటేశ్, డివిజన్ పార్టీ అధ్యక్షుడు ముడుపు రాజిరెడ్డి, రోజారెడ్డి, సదానంద్‌రెడ్డి, శ్రీనాథ్ పాల్గొన్నారు.

వైశ్యుల సంక్షేమానికి నిరంతరం కృషి


కల్వ సుజాత గుప్తాను సన్మానిస్తున్న కాచం సత్యనారాయణ గుప్తా తదితరులు

లింగోజిగూడ: వైశ్యుల సంక్షేమం, అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని రాష్ట్ర వైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కల్వ సుజాత గుప్తా అన్నారు. మంగళవారం కర్మన్‌ఘాట్ లక్ష్మి కన్వెన్షన్‌లో వైశ్య వికాస వేదిక చైర్మన్ కాచం సత్యనారాయణ గుప్తా ఆధ్వర్యంలో తెలంగాణ వైశ్య కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన సుజాత గుప్తాను సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పదేళ్ల అధికారంలో ఉన్న కేసీఆర్ ప్రభుత్వం వైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయలేదని, వంద రోజుల కాంగ్రెస్ పాలనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో వైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయడంతో ఎన్నో ఏళ్ల వైశ్యుల కల సాకారమైందన్నారు. కార్పొరేషన్ ద్వారా పేద వైశ్యుల విద్య, వైద్యానికి సహకారం అందిస్తామన్నారు. అనంతరం వైశ్య వికాస వేదిక చైర్మన్ కాచం సత్యనారాయణ గుప్తా మాట్లాడుతూ, వైశ్య కార్పొరేషన్ ఏర్పాటుతో పాటు, వైశ్య కమిషన్‌ను కూడా ఏర్పాటు చేయాలని కోరారు. జనాభా ప్రాతిపదికన వైశ్యులకు రాజకీయంలో కూడా సమాన హక్కు, సమాన వాటా అందించాలన్నారు. కార్యక్రమంలో కాచం సుష్మ గుప్తా, కల్వ శంకర్, వైశ్య వికాస వేదిక జనరల్ సెక్రటరీ నంగునూరు రమేష్, సభ్యులు రామ్ నరేష్, శ్రీనివాస్, కొత్త రవి, కోడమూరి దయాకర్, కాచం సాయి, వివిధ జిల్లాల నుంచి వైశ్య నాయకులు పాల్గొన్నారు.

గుడిని తొలగిస్తే సహించం: కొప్పుల


ఆర్ అండ్ బీ అధికారులతో మాట్లాడుతున్న కొప్పుల నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: విజయవాడ జాతీయ రహదారిపై జరుగుతున్న రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా లెక్చరర్స్ కాలనీ పరిధిలో ఉన్న పోచమ్మ ఆలయాన్ని తొలగిస్తే సహించేది లేదని మన్సూరాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. మంగళవారం లెక్చరర్ కాలనీ సంక్షేమ సంఘం సభ్యులతో కలిసి కార్పొరేటర్ నర్సింహా రెడ్డి రోడ్డు విస్తరణ పనులు పర్యవేక్షిస్తున్న ఆర్ అండ్ బీ అధికారులను కలిశారు. ఆలయం జోలికి రావద్దని అధికారులను ఆయన కోరారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, రహదారి పనులు తొందరగా పూర్తి చేయాలన్న ఉద్దేశంతో ఆర్ అండ్ బీ అధికారులు ఆలయాన్ని తొలగించవద్దని అన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి


ర్యాలీలో పాల్గొన్న యూసీడీ విభాగం అధికారులు, సిబ్బంది

మలక్‌పేట: ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు గురి కాకుండా ఓటు హక్కు సద్వినియోగించుకోవాలని జీహెచ్‌ఎంసీ సర్కిల్–6 యూసీడీ డీపీఓ, స్వీప్ నోడల్ ఆఫీసర్ జి.యుగేందర్‌రెడ్డి అన్నారు. యూసీడీ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం ఓటుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 18 ఏళ్లు నిండిన యువకులు ఓటు హక్కును నమోదు చేసుకోవాలన్నారు. ఓటర్ లిస్టులో తప్పులు ఉంటే సరి చేయించుకోవాలన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు పవిత్రమైందని, ఓటుహక్కు ఉన్న ప్రతి ఒక్కరూ ఓటింగ్‌లో పాల్గొనాలని కోరారు. మలక్‌పేట సూపర్ బజార్ నుంచి కాలనీలలో ర్యాలీ కొనసాగింది. కార్యక్రమంలో సీఓలు రవి, రామకృష్ణ, ఆండాలు, వీఆర్‌పీఎం అర్ష, టీఎల్‌ఎఫ్ సెక్రటరీ రాణి, ఎస్‌జీహెచ్ సభ్యులు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

నీటి సంరక్షణ మనందరి బాధ్యత



సైదాబాద్ కాలనీలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వాటర్‌వర్క్స్ ఉద్యోగులు

సైదాబాద్: మానవాళికి ముఖ్యమైన వనరుల్లో ఒకటైన నీటిని సంరక్షించుకోవడం మనందరి బాధ్యతగా గుర్తించాలని ఆస్మాన్‌ఘడ్ వాటర్‌వర్క్స్ డీజీఎం షీలారాణి అన్నారు. ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ వాటర్‌వర్క్స్ డిపార్ట్‌మెంట్ నిర్వహిస్తున్న శాంతి కోసం నీరు కార్యక్రమంలో భాగంగా మంగళవారం సైదాబాద్ కాలనీలో ఆస్మాన్‌ఘడ్ వాటర్‌వర్క్స్ ఉద్యోగులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న డీజీఎం మాట్లాడుతూ, మన దైనందిన జీవితంలో నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. అందరూ తమ ఇళ్లల్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. కాలనీలో తాగునీటి సరఫరా సమయంలో పలు ఇళ్ల నుంచి వృథా తాగునీరు బయటకు వచ్చి రోడ్లపై పారుతున్నదని కాలనీవాసులు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయంపై ఆమె స్పందిస్తూ తాగునీటిని ఎవరు వృథా చేసినా చర్యలు తీసుకుంటామని, వారికి జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సైదాబాద్ వాటర్ వర్క్స్ ఏఈ శ్రవణ్‌కుమార్, మనోహర్, కాలనీవాసులు పాల్గొన్నారు.

చక్కగా చదివితే ఉన్నతస్థాయికి ఎదగవచ్చు


సేవ్ ఫౌండేషన్ సెంటర్ విద్యార్థులకు పరికరాలు అందజేసిన రోటరీ క్లబ్ ప్రతినిధులు

సైదాబాద్: విద్యార్థులు చక్కగా చదివితే భవిష్యత్‌లో ఉన్నతస్థాయికి ఎదుగుతారని రోటరీ క్లబ్ అధ్యక్షుడు శ్యామ్యూల్ అన్నారు. మంగళవారం ఐఎస్‌సదన్ డివిజన్ సింగరేణి కాలనీలోని సేవ్ ఫౌండేషన్ లెర్నింగ్ సెంటర్‌లో చదువుకుంటూ పరీక్షలకు సన్నద్ధమవుతున్న 3 నుంచి 9వ తరగతి చదువుతున్న 120 మంది విద్యార్థులకు రోటరీ క్లబ్ ప్రతినిధులు ఎగ్జామ్ ప్యాడ్స్, కంపాక్స్ బాక్స్, పెన్నులు, పెన్సిళ్లు తదితర పరీక్షలకు ఉపయోగపడే పరికరాలను అందజేశారు. సేవ్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు ప్రొఫెసర్ సూరేపల్లి సుజాత మాట్లాడుతూ, విద్యార్థులు ఏకాగ్రత పట్టుదలతో వార్షిక పరీక్షలకు సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు పార్ల్ అలెక్స్, పావని, శ్రీను, చందర్, అల్మాస్, యాసిన్, అనూష, అంజలి, ఎంవి ఫౌండేషన్ ప్రతినిధి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో గెలుపే బీజేపీ లక్ష్యం : సంరెడ్డి

సైదాబాద్: హైదరాబాద్ ఎంపీ స్థానంలో గెలుపే లక్ష్యంగా బీజేపీ భాగ్యనగర్ జిల్లా కమిటీ పని చేస్తున్నదని పార్టీ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం సైదాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, హైదరాబాద్ ఎంపీగా బీజేపీ అభ్యర్థి గెలిపించి చరిత్ర సృష్టించడం ద్వారా విజయాన్ని ప్రధాని మోదీకి బహుమతిగా అందజేస్తామన్నారు. ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా జిల్లాలోని ఏడు మోర్చాలకు నూతన అధ్యక్షులను నియమించినట్లు ఆయన తెలిపారు. జిల్లా కిసాన్‌మోర్చా అధ్యక్షుడిగా సైదాబాద్‌కు చెందిన మడిగెల లక్ష్మారెడ్డి, యువమోర్చా అధ్యక్షుడిగా భరత్, మహిళామోర్చా అధ్యక్షురాలుగా మంజులారెడ్డి, ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగా విజయ్‌కుమార్, బీసీ మోర్చా అధ్యక్షుడిగా రాజశేఖర్, ఎస్టీ మోర్చా అధ్యక్షుడిగా గోపీ నాయక్, మైనారిటీ మోర్చా అధ్యక్షుడిగా సయ్యద్ నాసర్ అహ్మద్‌లను నియమించినట్టు సురేందర్‌రెడ్డి తెలిపారు. వీరంతా త్వరలో ఆయా మోర్చాల జిల్లా నూతన కార్యవర్గాలను పూర్తి చేస్తారని ఆయన తెలిపారు. జిల్లా కిసాన్‌మోర్చా అధ్యక్షుడిగా నియమితుడైన సైదాబాద్‌కు చెందిన నాయకుడు మడిగెల లక్ష్మారెడ్డి జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డికి శాలువా కప్పి కృతజ్ఞతలు తెలిపారు.

చెత్తమయంగా కాలనీలు


బీఎన్‌రెడ్డినగర్‌లో..

పట్టించుకోని శానిటేషన్ అధికారులు

ఎల్‌బీనగర్: జీహెచ్‌ఎంసీ అధికారుల నిర్లక్ష్యం.. కొరవడిన పర్యవేక్షణ.. ఫలితంగా ఎల్‌బీనగర్ సర్కిల్–3 పరిధిలోని కాలనీలన్నీ చెత్తమయంగా మారుతున్నాయి. ఎక్కడ చూసినా చెత్త దర్శనం ఇస్తోంది. ప్రతి రోజూ కాలనీల్లోని చెత్తను ఊడ్చిన తర్వాత అధికారులు దానిని డంపింగ్ యార్డుకు పంపించాలి. కానీ ఇక్కడ అధికారులకు చెత్త శుద్ధి లేకపోవడంతో చెత్త కాలనీలుగా మారుతున్నాయి. చెత్త ఎత్తకపోవడం ఒక ఎత్తైతే పారిశుద్ధ్య కార్మికులు ఊడ్చిన చెత్తను అక్కడనే కాల్చేయడం మరో ఎత్తుగా మారింది. దీంతో చెత్తను లిఫ్ట్ చేసే వాహనాల వారు చెత్తను తొలగిస్తున్నామని డీజిల్‌ను అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇక శానిటేషన్ సిబ్బంది ఊడ్చిన చెత్తను తొలగించక పోవడం, మరో పక్క రోడ్ల పక్కనే చెత్తను వేయడం వల్ల రోడ్లు చెత్త మయంగా మారుతున్నాయి. ముఖ్యంగా శివారు కాలనీల్లో ఈ సమస్య తీవ్రంగా ఉందని పలువురు వాపోతున్నారు. మొత్తానికి సర్కిల్ అధికారులు పర్యవేక్షణ లేకపోవడం వల్ల ఎల్‌బీనగర్ చెత్త సర్కిల్‌గా మారిందని పలువురు అంటున్నారు.

తొలగించడంలేదు..

కాలనీలో సరిగా చెత్తను తొలగించడంలేదు. రోజూ చెత్తను ఊడ్చి అక్కడనే ఉంచుతున్నారు. కాలనీవాసులు కొందరు తమ ఇంట్లోని చెత్త సేకరణ ఆటో వారికి ఇవ్వకుండా రోడ్లపై వేయడం వలన దోమలు, ఈగలు వృద్ధి చెంది దుర్వాసన వస్తోంది. వెంటనే చెత్తను తొలగించాలని విజ్ఞప్తి చేస్తున్నా. –గణేష్, బీఎన్‌రెడ్డినగర్ కాలనీ

ధర్మభిక్షాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలి


సాయినగర్‌లో ధర్మభిక్షం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఐ నేత చందు తదితరులు


వర్కర్స్ పార్టీ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న పాండురంగచారి, జిలకర శ్రీనివాస్ తదితరులు

నాగోలు: కార్మిక, కర్షక, విద్యార్థి, గౌడ కులస్తుల సమస్యల పరిష్కారానికి అలుపెరగని పోరాటలు చేసిన ఘనత తెలంగాణ సాయుధ పోరాట యోధుడు బొమ్మగాని ధర్మభిక్షంకే దక్కతుందని, నేటి యువత ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు కె. చందు అన్నారు. మంగళవారం ధర్మభిక్షం 13వ వర్ధంతి సభ నాగోలు డివిజన్ సాయినగర్ కాలనీలోని ధర్మభిక్షం భవనంలో నిర్వహించారు. ధర్మభిక్షం చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన సభలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు చందు మాట్లాడుతూ, ధర్మ భిక్షం విద్యార్థి దశ నుంచే రాజకీయాల్లో ప్రవేశించారని, పాఠశాల దశలోనే తోటి విద్యార్థులను చైతన్యపర్చి నిజాం నవాబుకు వ్యతిరేకంగా, రజాకారులకు వ్యతిరేకంగా ప్రజలను ఐక్యం చేసి తిరుగుబాటు చేశారని అన్నారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా రెండుసార్లు ఎంపీగా పనిచేసిన ధర్మ భిక్షం చట్టసభల్లో పీడిత ప్రజల గొంతు వినిపించారని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ శాఖ కార్యదర్శులు సహిదా బేగం, ఆరెకంటి రాములు, శ్రీనివాస్, రాజేష్, నాయకులు కొమ్ము రాములు, ప్రమీల, నాగేటి పద్మ, స్రవంతి, నాగమణి, స్వప్న,అరుణ, కృపావరం పల్లవి, సంపత్, జ్యోతి, శ్రీదేవి పాల్గొన్నారు.

కొత్తపేటలో వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో..

తెలంగాణ సాయుధ పోరాట యోధులు, పేదల పెన్నిధి కామ్రేడ్ బొమ్మగాని ధర్మభిక్షం విగ్రహాన్ని ట్యాంక్ బండ్ పై ఏర్పాటు చేయాలని వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు రాయబండి పాండురంగా చారి, విదుతలై చిరుతైగల్ కట్చి పార్టీ (వీసీకే) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు జిలకర శ్రీనివాసు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కామ్రేడ్ ధర్మభిక్షం వర్ధంతి కొత్తపేటలోని వర్కర్స్ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర నాయకులు ఎస్వీ రాములు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పాండురంగా చారి, జిలకర శ్రీనివాస్ హాజరై ధర్మ భిక్షం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వర్కర్స్ పార్టీ రంగారెడ్డి జిల్లా కన్వీనర్ పూజారి శ్రీను, వీసీకే పార్టీ నాయకులు మచ్చ దేవేందర్, చెరుపల్లి ఆనంద్, మల్లాపురం వెంకటేష్ యాదవ్, వర్కర్స్ పార్టీ నాయకులు మమ్మద్ ఇస్మాయిల్, వర్రే ఇస్తారి తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలు ఇచ్చే వరకు పోరాడతాం...

దిల్‌సుఖ్‌నగర్: ఎన్టీఆర్ నగర్‌వాసులకు ఇళ్ల పట్టాలు ఇస్తామని ఎన్నో ఏళ్లుగా ప్రతి రాజకీయ నాయకుడు మోసం చేశారని, వారికి పట్టాలు ఇచ్చేంత వరకు కామ్రేడ్ ధర్మభిక్షం స్ఫూర్తితో తాము పోరాడతామని వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షులు రాయబండి పాండురంగా చారి అన్నారు. వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా ఆర్‌కేపురం డివిజన్ కన్వీనర్ మహ్మద్ ఇస్మాయిల్ ఆధ్వర్యంలో మంగళవారం ఎన్టీఆర్ నగర్‌లో ధర్మభిక్షం వర్ధంతిని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన పాండురంగా చారి.. ధర్మభిక్షం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మునుకుంట్ల మురళి, విజయలక్ష్మి, పురుషోత్తం చారి, మట్టోజు స్వామి తదితరులు పాల్గొన్నారు.